క్లుప్తంగా

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సెలవు రోజు అయినప్పటికి గురువారం పంచాయతీ కార్యదర్శులు సర్వేను కొనసాగిస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 8228 దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీఓ బ్రహ్మచారి తెలిపారు. పకడ్బందీగా దరఖాస్తుదారుల వివరాల యాప్‌లో నమోదు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మర్రికి ఎర్రశేఖర్ పరామర్శ



తిమ్మాజిపేట: మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పలువురు నాయకులతో కలిసి నేరళ్లపల్లికి వెళ్లి మర్రి జంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మర్రిని పరామర్శించారు. మాజీ సర్పంచ్ అజయ్‌కుమార్, నాయకులు ఐతోల్ లక్ష్మయ్య, జగదీశ్వర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

లింగాల: మండల కేంద్రంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాను ఎగుర వేశారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నదాసు, బాలస్వామి, రాములు, శ్రీనివాసులు, వెంకటస్వామి, బాలకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మార్చాల విద్యార్థి



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విష్ణు రాష్ట్ర స్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగామ జిల్లాలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటాడని గురువారం హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. అనంతరం పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు యాదయ్యగౌడ్ అభినందించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెంట్లవెల్లి: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కార్మికుల ఎలా జీవిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణయ్య, లక్ష్మి, కాశీం, చిన్ననర్సింహ, రజిత, బాలరాజు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జనగామకు బయలుదేరిన క్రీడాకారులు

కల్వకుర్తిరూరల్: రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీలు ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగామలో నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు క్రీడాకారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మైదానంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ క్రీడాకారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్, మోహన్‌లాల్, ప్రకాష్, కోచ్ గణేష్ పాల్గొన్నారు.



నిధుల కొరత.. నిలిచిన పనులు

- అసంపూర్తిగా పంచాయతీ భవనాలు
- పట్టించుకోని అధికారులు



కేస్లీతండాలో అసంపూర్తిగా పంచాయతీ భవనం

వెల్దండ: మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటైన 20 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలను నిర్మించడానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో జాతీయ ఉపాధిహామీ పథకం కింద 9 పంచాయతీలకు, గిరిజన ప్రత్యేక నిధుల కింద మరో 11 పంచాయతీలకు గతేడాది కిందట నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్క భవనానికి రూ. 20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. కొన్నిచోట్ల పనులు చేసిన నేటికి బిల్లులు అందకపోవడంతో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

నూతన పంచాయతీలకు భవనాలు మంజూరు

నూతనంగా ఏర్పడిన 20 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేసింది. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో గత ఐదేళ్ల కాలంలో అద్దె భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలు నిర్వహించారు. దీంతో పాలనకు అనేక ఇబ్బందులు ఏర్పడటంతో గత ప్రభుత్వం భవనాలను మంజూరు చేసింది. జాతీయ ఉపాధిహామీ పథకంలో భర్కత్‌పల్లి, రాఘయపల్లి, కంటోనిపల్లి, గుండాల, లింగారెడ్డిపల్లి, తిమ్మినోనిపల్లి, బండోనిపల్లి, పల్లతండా, పోచమ్మగడ్డతండాలకు పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టారు. వీటిలో 4 చోట్ల దాదాపుగా పనులు పూర్తి చేశారు. మిగిలిన చోట అసంపూర్తిగా పనులు ఉన్నాయి. అదే విధంగా గిరిజన ప్రత్యేక నిధుల కింద అల్లంతోటబావితండా, గానుగ్‌బట్టతండా, కేస్లీతండా, కుందారంతండా, ఎంజే కాలనీతండా, మద్దిగుంటతండా, నగరగడ్డతండా, నారాయణపూర్‌తండా, శంకరకొండతండా, సిలోనిబావితండా, ఉబ్బలగుట్టతండాలకు భవనాలు మంజూరయ్యాయి. 11 గిరిజన తండాల గ్రామ పంచాయతీలకు భవనాల్లో కేవలం కేస్లీతండా, గానుగ్‌బట్టతండాలో పనులు ప్రారంభించారు. నిధుల కొరత ఉండటంతో అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. మిగిలిన గ్రామ పంచాయతీల్లో స్థలాల కొరత, బిందర్ల సమస్య ఉండటంతో 9 చోట్ల పనులను ప్రారంభించలేదు. చేసిన పనులకు బిల్లులు నేటికి అందకపోవడంతో మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

భవన నిర్మాణాలను పూర్తి చేస్తాం



మండలానికి ప్రభుత్వం 20 గ్రామ పంచాయతీ భవనాలను మంజూరు చేసింది. వీటిలో ఆయా గ్రామాల్లో పనులను ప్రారంభించి నిర్మించడానికి కృషి చేస్తున్నాం. కొన్ని పంచాయతీలకు స్థలాల సమస్య ఉన్న విషయం వాస్తవమే. ప్రభుత్వ స్థలం కోసం రెవెన్యూ అధికారులతో చర్చించాం. నిధుల కొరత ఉండటంతో ప్రస్తుతం భవన నిర్మాణ పనులు నిలిచాయి. నిధులు మంజూరైన వెంటనే పూర్తి చేయిస్తాం.

– సత్యపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, వెల్దండ

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు: క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన క్యాంప్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు–తెలకపల్లి జట్టు తలపడగా నాగర్‌కర్నూల్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. త్వరలో నియోజకవర్గానికి ఒక స్టేడియం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. పేర్కొన్నారు. విన్నర్ జట్టుకు రూ. 20 వేలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమణారావు, కొండ నగేష్, జక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

స్ప్రింక్లర్లు పంపిణీ

మండలంలో పలు గ్రామాల రైతు లబ్ధిదారులకు మంజూరైన స్ప్రింక్లర్లను గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తాడూరు: మండలంలోని చెర్ల ఇటిక్యాలలో డీలర్ రామకృష్ణ తండ్రి జంగయ్య(60) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రోహిణీ గోవర్ధన్ రెడ్డి, ఉద్యానవర్సిటీ శాస్త్రవేత్త కే భాస్కర్, కాంగ్రెస్ నాయకులు సత్యం గౌడ్, పెంటయ్య, బాల్ రెడ్డి, ప్రసాద్, మల్లయ్య, వెంకటయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్ బహదూర్ జన్మదినం

తిమ్మాజిపేట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ బహదూర్ జన్మదిన వేడుకలను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై శ్రీనివాస్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

అకాల వర్షం.. రైతన్న పరేషాన్



తడిసిన వేరుశనగ

పెంట్లవెల్లి: రెండు రోజులుగా ముసురు వర్షాలకు వేరుశనగ రైతులు ఆగంఆగం అవుతున్నారు. మండలంలోని మంచాలకట్ట, మాధవస్వామినగర్, ఎంగంపల్లి తండా, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల ప్రజలు మూడు నెలల కిందట వేసిన దాదాపు వంద ఎకరాల వేరుశనగ పంట వారం రోజుల కిందట కోశారు. వేరుశనగను ఆరబెట్టుకొనేందుకు రైతులు సిద్ధమవుతున్న వేళలో మేఘాలు కమ్ముకొని ముసురు పట్టడంతో చేతికొచ్చిన పంట నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోయారు. వేరుశనగ నల్లు రంగులోకి మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

చారకొండ: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ జిల్లా నాయకుడు చిల్లర శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు చేయలేదని విమర్శించారు. మండల కేంద్రంలో నిర్వహించే సీపీఐ శత జయంతి ఉత్సవాలు నాయకులు, కార్మికులు యువకులు, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కార్యదర్శి ఏసోరావు అశోక్, సీనియర్ నాయకులు మద్దినారాయణ రెడ్డి, జిల్లా బాలయ్య, మొగిళ్ల శ్రీను, తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల సహకారం అభినందనీయం



మత్స్యకారులతో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

తెలకపల్లి: పెద్ద చెరువు తూము దగ్గర చెట్ల దేవరా తొలగింపులో మత్స్యకారుల కృషి అభినందనీయమని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన స్థానిక మత్స్యకారులను కలిసి అభినందించి మాట్లాడారు. నాలుగు రోజులుగా అధికారులు చెత్తను తొలగించడంలో ఇబ్బందులు పడుతుండటంతో మత్స్యకారులు దగ్గరుండి పనులు చేశారని తెలిపారు. సమస్య పరిష్కారంలో భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. అనంతరం చెత్తను తొలగింపునకు సహకరించిన మత్స్యకారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట రూరల్: ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి శుక్ర, మంగళవారాల్లో హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి ఏర్పాటు చేసిందని, నల్లమల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్ కోరారు. గురువారం ఆయన అచ్చంపేటలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు, గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ప్రత్యేక కౌంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నల్లమల ప్రాంతంలోని ప్రజలు, ప్రవాసుల కుటుంబీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీ ఉన్నా టికెట్ తీసుకోవాల్సిందే!

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు కొన్ని ప్రత్యేక కేటగిరీల వారికి రాయితీ పాస్‌లను అందజేస్తోంది. అందులో భాగంగానే గుర్తింపు పొందిన జర్నలిస్టులకు కార్పొరేషన్ ద్వారా మూడు రకాల జర్నలిస్టు పాస్‌లను జారీ చేస్తోంది. కాని జర్నలిస్టుల రాయితీ పాస్‌లపై కండక్టర్లు, డ్రైవర్లు అవగాహన రాహిత్యంతో ప్రతికూలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. టిమ్ మిషన్‌లో రాయితీ టికెట్ ఎలా ఇవ్వాలో తెలియక పూర్తి టికెట్ తీసుకోవాలని బేదిరింపులతో దిగిపోవాల్సిందేనని ఖరాకండిగా చెప్పేస్తున్నారు. టికెట్ ఇచ్చే విషయంతో హైదరాబాద్– శ్రీశైలం రూట్లో ప్రయాణించే జర్నలిస్టులు, ఆర్టీసీ ఉద్యోగుల మధ్య నిత్యం వాగ్వాదాలు చోటుచేసుకుంటుంది. తాజాగా ఇలాంటి పరిస్థితి అచ్చంపేట సీనియర్ జర్నలిస్టుకు ఎదురైంది. ఈనెల 24న ఉదయం 7 గంటల సమయంలో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్(ఐఎస్‌ సదన్)లో నంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెంబర్(టీఎస్ 15జెడ్ 0212)లో ఎక్కాడు. టికెట్ కోసం తమ వద్ద ఉన్న జర్నలిస్టు స్టేట్ పాస్‌ను టిమ్స్ డ్రైవర్‌కు చూపించారు. టిమ్స్‌లో తనకు ఆప్షన్ తెలియదని డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవాలని చెప్పడం ఆ బస్సు దిగి వేరే ఆర్టీసీ బస్సు ఎక్కి అచ్చంపేటకు వచ్చాడు. సదరు బస్సు డ్రైవర్‌పై ఆ జర్నలిస్టు వాట్సాప్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఎండీ సంగారెడ్డి డీపో మేనేజర్‌కు ఫిర్యాదు అందించారు. ఆ డీపో మేనేజర్ జర్నలిస్టుకు ఫోన్ కాల్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు జర్నలిస్టు తెలిపాడు.

వరికొయ్యలు దహనం



పెద్దకొత్తపల్లి: వానాకాలం సాగు చేసిన వరి కొయ్యలను రైతులు తగులబెడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఏటేటా ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి వరికొయ్యలను తగులబెట్టొద్దని వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు, సలహాలు చేసిన పట్టించుకోకుండా దేవటిచెరువు,మారూర్ గ్రామానికి చెందిన రైతులంతా వరి కొయ్యలను తగులబెట్టి వాతావరణ కాలుష్యం చేస్తున్నారు. వరి కొయ్యలను దున్ని భూమిలో కలియబెడితే సేంద్రియ ఎరువుగా తయారవుతుందని వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు.

రైతులకు రూ.85.87 లక్షల బోనస్

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సన్న వడ్లకు రూ.85.87 లక్షల బోనస్ అందుకున్నట్లు సింగిల్ విండో అధికారులు గురువారం తెలిపారు. సింగిల్ విండో ద్వారా వివిధ గ్రామాల్లో 306 మంది రైతుల నుంచి 17,174 క్వింటాళ్ల సన్న వడ్లను సేకరించగా.. వారికి క్వింటాల్‌కు రూ.500 కలిపి రూ.2820 అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో పాటు దొడ్డు వడ్లు 1,266 మంది రైతుల నుంచి 6,845 క్వింటాళ్లు సేకరించి వారికి రూ.15.08 కోట్లు రైతులకు అందజేశామన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జాప్యం లేకుండా వెంటనే జమ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



పీఎం కిసాన్‌నిధికి దరఖాస్తు చేసుకోండి

బిజినేపల్లి: నూతనంగా పట్టా పాసు పుస్తకాలు పొందిన వారు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని బిజినేపల్లి మండల వ్యవసాయాధికారి నీతి గురువారం ఒ ప్రకటనలో తెలిపారు. అర్హులైన పట్టాదారు రైతులు పీఎం కిసాన్ దరఖాస్తు ఫారానికి పట్టాదారు పాసు పుస్తకం, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా పాసు పుస్తకం జత పరిచి ఆ గ్రామ క్లస్టర్ ఏఈఓకు అందజేయాలని సూచించారు.

ఆలయ అభివృద్ధికి దాతల విరాళం

వెల్దండ: మండల కేంద్రంలోని శివునిగుట్టపై ఉన్న ఆలయాల అభివృద్ధికి గురువారం దాతలు విరాళాలను అందజేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్ రూ.20వేలు, శేఖర్, జంగిలి యాదగిరి, నాన్‌రెడ్డి, సాకలి రంగయ్యలు రూ.10వేల చొప్పున, ఎల్‌పీసీ తిరుపతి, సాకలి అంజయ్య, శ్రీశైలం, గొడుగు శ్రీను రూ.5వేల చొప్పున దాతలు విరాళాలు అందజేశారు. నిర్వాహకులు వెంకటేష్, తదితరులు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



పెద్దకొత్తపల్లి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక సభలు ఈ నెల 28, 29, 30 తేదీలలో నల్గొండ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకుడు ఎండీ గౌస్‌పాషా తెలిపారు. సభకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం విద్యాశాఖ కల్పించిందని వివరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మహేష్‌బాబు, చంద్రశేఖర్, రమాదేవి, అంజనేయులు, రాజు, లక్ష్మణ్, సువర్ణ పాల్గొన్నారు.

ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు



అచ్చంపేట రూరల్: ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా లింగాల ప్రాంతానికి చెందిన ఉల్లెంగొండ రాజును, ప్రధాన కార్యదర్శిగా బండి నర్సింహులును నియమించారు. గురువారం ఆ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండల అంజనేయులు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరుకల జాతి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎరుకల సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళ్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముగింపు వేడుకలు

లింగాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ ముగింపు వేడుకలను నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల నాయకులు జబ్బార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేఎల్ఐని పూర్తి చేయాలి

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని వచ్చే సంవత్సరం జూలై నాటికి పూర్తి చేయాలని కేఎల్ఐ జేఏసీ నాయకుడు బండెల రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్ట్ ప్రారంభించి 20 సంవత్సరాలు కావొస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కో

వ్యక్తిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని దారారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మల్లేష్‌గౌడ్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఫోటోలు సామాజిక మాధ్యమాలలో పోస్టు చేసి స్థానికుల మనోభావాలను దెబ్బతీసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఒకరికి జైలు శిక్ష, జరిమానా

పెద్దకొత్తపల్లి: పాలెకిపాడుకు చెందిన బొల్లినాగయ్య ఈ నెల 22న నాయనోనిపల్లి మైసమ్మ జాతర వద్ద మద్యం తాగి వాహనం నడుపుతూ పెద్దకొత్తపల్లిలో పోలీసులకు పట్టుబడినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. గురువారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిందితుడికి రెండు రోజులు జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫారెస్టు రేంజర్‌కు వినతి

కొల్లాపూర్ రూరల్: ఆర్‌ఓఎఫ్ కింద పట్టాలిచ్చిన పోడు భూములను సాగు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని ఫారెస్టు కార్యాలయంలో ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్‌కు గురువారం రైతులు వినతిపత్రం మండలంలోని అమరగిరి గ్రామంలోని చెంచుగూడెనికి చెందిన నిమ్మల నాగన్న, పురుషాల మల్లయ్య, పెద్ద లింగన్న, ఐతెని కురుమయ్య, నిమ్మల మల్లయ్యలకు గతంలోనే ఆర్‌ఓఎఫ్ కింద 20 ఎకరాల ఫారెస్టు పోడు భూములకు పట్టాలిచ్చారని వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్ తగదు



కందనూలు: కేజీబీవీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదులు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేయడంపై రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, కొత్త శ్రీధర్‌రావు తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు నష్టం జరుగుతుందని తక్షణమే 17 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వ శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బుద్ధుని ఆశయాలు సాధిద్దాం

అమ్రాబాద్: బుద్ధుని ఆశయాలు సాధిద్దామని ఉస్మానియా యూనివర్సిటీ జాక్ చైర్మన్, అంబ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాల భాస్కర్ కోరారు. గురువారం పదర మండల కేంద్రంలో మద్దెల రాజు, నాగలక్ష్మి ఆదర్శ వివాహ మహోత్సవంలో ఆయన పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాలలు బుద్ధుని మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో స్టామ్ వెలుగోపాల్, గద్దం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రామనారం, కుంద మల్లికార్జున్, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజనేయులు, ఓయూ విద్యార్థి సంఘం, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

పాన్‌గల్: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండలంలోని వెంగళాయపల్లి, కేతేపల్లి సబ్‌సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలు, వైద్య సేవలపై ఆరా తీశారు.